క్లుప్తంగా

1న వేలంపాట

చక్రాయపేట: మండల కేంద్రం చక్రాయపేటలో ప్రతి ఆదివారం జరిగే వారపు సంతతో పాటు చెరువుల్లోని చేపలు పట్టుకుని విక్రయించు కొను నిమిత్తం జూన్ 1న వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి(ఈవోపీఆర్డీ) గంగులయ్య తెలిపారు. చక్రాయపేట పంచాయతీలోని దేశిరెడ్డి చెరువు, రేకులకుంట చెరువు, ఉప్పర్ల కుంట చెరువుల్లో చేపలు పట్టుకుని విక్రయించు కొనే హక్కు కల్పించు నిమిత్తం వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు రూ.500 డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

కట్టడాలను నిలిపివేయాలి

వీరపునాయునిపల్లె : చాగలమర్రి నుండి రాయచోటి వరకు ఏర్పాటు చేయనున్న రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులు కట్టడాలను నిలిపివేయాలని డిప్యూటీ తహసీల్దార్ వీరశేఖర్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాలా మంది రైతులు ఎక్కువ నష్ట పరిహారం వస్తుందన్న ఉద్దేశంతో రహదారికి ఇరువైపులా నిర్మాణాలు చేపట్టడం జరుగుతోందన్నారు. భూ సేకరణ ప్రక్రియ ఇదివరకే ప్రారంభమయిందని తెలియజేశారు. ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణాలకు ఎటువంటి నష్ట పరిహారం రాదన్నారు.

వాహనాల వేలం పాట



వాహనాలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న ఎస్ఈబీ అధికారులు

పులివెందుల రూరల్ : వాహనాల బహిరంగ వేలం పాట ద్వారా ప్రభుత్వానికి రూ.1.03 లక్షల ఆదాయం వచ్చిందని ఎస్ఈబీ సీఐ రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో వివిధ కేసులలో సీజ్ కాబడిన వాహనాలకు ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ఆరు వాహనాలను రూ.1,03,400లకు దక్కించుకోగా.. రూ.18,616ల జీఎస్టీ కలుపుకుని ప్రభుత్వ ఖజానాకు జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ కళ్యాణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీతత్వం పెంచుకోవాలి



గెలుపొందిన జట్టుకు షీల్డ్ అందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ఆటల ద్వారా క్రీడాకారులు పోటీతత్వం పెంచుకుని క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ముద్దనూరు మండలం కేంద్రంలో వైఎస్సార్‌సీపీ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. అనంతరం గెలిచిన జట్లకు బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌బీకేలలో వైట్ పొటాష్ నిల్వలు

లింగాల : లింగాల మండలంలోని రైతు భరోసా కేంద్రాలకు ఐపీఎల్ కంపెనీ తెల్ల పొటాష్ ఎరువులు వచ్చి చేరాయని ఏఓ రమేష్ తెలిపారు. మండలంలోని లింగాల, వెలిదండ్ల, పార్నపల్లె, కోమన్నూతల, పెద్దకుడాల సచివాలయాలలో 400బస్తాల చొప్పున నిల్వలు ఉంచామన్నారు. 50కిలోల బస్తా రూ.1700లకు రైతులకు అందిస్తున్నామన్నారు. మిగిలిన రైతు భరోసా కేంద్రాలకు కూడా తెల్ల పొటాష్ ఎరువులు త్వరలో వచ్చి చేరుతాయన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమవారం లింగాల రైతు భరోసా కేంద్రంలో తెల్ల పొటాష్‌ను ఏఓ రైతులకు పంపిణీ చేశారు.

విత్తన కాయల పంపిణీ

చక్రాయపేట : ఎస్సీ, ఎస్టీ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసిన నూతన వేరుశనగ వంగడాలను(లేపాక్షి రకం)సోమవారం పంపిణీ చేశారు. చక్రాయపేట మండలానికి 20 కిలోల బరువు గల 300 బస్తాల కాయలు వచ్చాయని వ్యవసాయ అధికారి నవంత్ బాబు తెలిపారు. వీటిని కల్లూరుపల్లె తాండా, కుప్పం తాండా కుమార్లకాల్వ హరిజనవాడ రైతులకు ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి, పాలఏకిరి సంఘం రాష్ట్ర డైరెక్టర్ సభాపతి నాయుడు, పార్టీ నేత పురుషోత్తం నాయక్ ల చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్ఏ మల్లిక పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో సోమవారం కాల భైరవ న్యాయ పరిరక్షణ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సంఘం నేతలు రామిరెడ్డి, చంద్రగిరిరెడ్డయ్యలు చేపట్టారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటం వల్ల మజ్జిగను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పథకాల అమలులో వలంటీర్లది కీలకపాత్ర

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో వలంటీర్లే కీలకమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో సోమవారం వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. ఏరాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ప్రతి రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకవచ్చి సచివాలయంలో ప్రజలకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంచి ప్రతి 50 ఇండ్లకు ఒక వలంటీరును ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు వారి ద్వారా ప్రజలకు అందజేయడం ప్రశంసనీయమన్నారు. వలంటీర్లు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం గురించి ప్రజలకు వివరించి వారికి పథకాల గురించి అవగాహన కల్పించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకరావాలన్నారు. అనంతరం సేవా వజ్ర కింద ఇద్దరు, సేవా రత్న కింద ఐదుగురు, సేవా మిత్ర కింద 224 మంది వలంటీర్లకు పురస్కారాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీడీవో అల్తాఫ్ హుస్సేన్, తహశీల్దార్ ఉదయ భాస్కర్‌రాజు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఘన సత్కారం

వేంపల్లె : వేంపల్లె మండల పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాల్లో పనిచేసే వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో వలంటీర్లకు సన్మాన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేసే వలంటీర్లు చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేసింది. మూడు కేటగిరీలుగా గుర్తించి నియోజకవర్గ పరిధిలో 5మందికి సేవా వజ్ర కింద రూ.30వేల



పెండ్లిమర్రి: సేవా వజ్ర వచ్చిన వలంటీరుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చొప్పున, మండల పరిధిలో 5మందికి సేవా రత్న కింద రూ.20వేల చొప్పున, మిగిలిన వలంటీర్లకు సేవ మిత్ర కింద రూ.10వేల చొప్పున అందజేశారు. అందులో వేంపల్లె పట్టణంలో 8వ సచివాలయంలో జి.ఫకృన్‌బీ, 1వ సచివాలయంలో మునికుమార్, కె.గాయత్రి, కత్తలూరు సచివాలయంలో వి.విజయలక్ష్మి, తాళ్లపల్లె సచివాలయంలో పి.శివప్రసాద్‌లు సేవా రత్న అవార్డులు అందుకున్నారు. 256మంది సేవా మిత్ర అవార్డులు అందుకున్నారు. వీరికి ఎంపీపీ లక్ష్మీగాయత్రి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు చేతులమీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రవిశంకర్‌రెడ్డి, ఎంపీటీసీలు భారతి, చంద్రశేఖర్, బాబా షరీఫ్, రహమతుల్లా ఖాన్, మణిగోపాల్‌రెడ్డి, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండల వ్యాప్తంగా 5మంది వలంటీర్లు సేవా రత్న పురస్కారాలకు ఎంపికయ్యారని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హిమకుంట్ల సచివాలయానికి సంబంధించి సుస్మిత, గురిజాల సచివాలయానికి సంబంధించి శివరత్న, అంకాలమ్మగూడూరు, బలపనూరు, పైడిపాలెం సచివాలయాలకు సంబంధించిన వలంటీర్లు సేవా రత్న పురస్కారాలకు ఎంపికయ్యారని.. వారి అకౌంట్లలో రూ.20 వేల చొప్పున డబ్బు జమ అవుతాయన్నారు. మిగిలిన వలంటీర్లకు కూడా సేవా మిత్ర పురస్కారాల కింద రూ.10వేల చొప్పున వారి అకౌంట్లలో డబ్బు జమ అయ్యాయని ఆయన తెలిపారు.

వలంటీర్ల సేవలు మరువలేం

ఎర్రగుంట్ల : సంక్షేమ పథకాలు అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్ల సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికీ మరువలేదని మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ పి జగన్నాథ్ ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్.. వలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధి వలంటీర్లు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలు అందించడంలో వారధులుగా వలంటీర్లు పనిచేస్తున్నారని మైలవరం మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సేవరత్న అవార్డు 5 మందికి, 178 మందికి సేవామిత్ర అవార్డు పొందిన వలంటీర్లకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ వై. రామచంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, చేరెడ్డి చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల : వలంటీర్లకు పురస్కారాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ జగన్నాథ్



వేంపల్లె : వలంటీర్‌కు సేవా రత్న అవార్డును అందిస్తున్న ఎంపీపీ, మండల కన్వీనర్, తదితరులు



జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ చేరెడ్డి సావిత్రి

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జమ్మలమడుగు : మండల పరిధిలోని పి.బొమ్మెపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి గంగాధర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డితోపాటు, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను తెలుసుకుంటారన్నారు.

శుభ కార్యాలకు రిజిష్టర్ చేసుకోండి

లింగాల : లింగాల మండలం చిన్నకుడాల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన టీటీడీ కళ్యాణ మండపంలో శుభ కార్యాలకు ప్రజలు ఆన్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి తెలిపారు. విశాలమైన కళ్యాణ మండపం, భోజనశాల, వాహనాల పార్కింగ్, మంచినీటి వసతి, వంట సామగ్రి తదితర సకల సౌకర్యాలు గల కళ్యాణ మండపాన్ని అతి తక్కువ బాడుగకు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8897027324 అనే ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చునన్నారు.

నేడు కౌన్సిల్ మీటింగ్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లతోపాటు మున్సిపల్ అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

వీరపునాయునిపల్లె : స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని పులివెందుల ఆర్డీఓ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఉరుటూరు 1 సచివాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గతంలో స్పందన కార్యక్రమం మండల స్థాయిలో సోమవారం ఒక్క రోజు మాత్రమే జరిగేదని, ప్రజలు ఇబ్బందులకు గురి కాకూడదన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఒక్క సచివాలయం, గురువారం మరో సచివాలయంలో నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరశేఖర్, మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

లింగాల : మండల కేంద్రమైన లింగాల సచివాలయంలో సోమవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి త్వరితగతిన వాటిని పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రమేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వీరపునాయునిపల్లె: స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ వెంకటేశ్వర్లు

20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పెద్దముడియం : మండలంలోని చిన్నపసుపుల గ్రామంలో 20 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే డా.సుధీర్ రెడ్డి పార్టీ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కృపాకర్ రెడ్డి, పుల్లారెడ్డి, పురుషోత్తంరెడ్డి, మాధవ రెడ్డి, కేశవరెడ్డి, సుదర్శన్ రెడ్డి, షణ్ముక రెడ్డితో పాటు 20 కుటుంబాల వారు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చవ్వా క్రిష్టారెడ్డి, భరత్ రెడ్డి, సుధీర్ రెడ్డి, గ్యాస్ శివా రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

పూడికతీత పనుల పరిశీలన

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో జరుగుతున్న మురికి కాలువ పూడికతీత పనులను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వచ్చినప్పుడు పట్టణంలో ఎక్కడే కానీ రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్ మనోహర్‌రెడ్డికి పలు సమస్యలను ప్రజలు విన్నవించగా.. అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, మునిసపల్ సిబ్బంది పాల్గొన్నారు.



పూడిక తీత పనులపై ఆరా తీస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు డీఏవీ విద్యార్థులు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్లలోని జువారి కర్మాగారంలో ఉన్న డీఏవీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురాం సోమవారం తెలిపారు. ఈ నెల 28వ తేదీన ప్రొద్దుటూరులో జరిగిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలలో పాల్గొని అండర్ 8,10,12,14 విభాగాలలో విద్యార్థులు ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. గుంటూరులో నిర్వహించబోవు రాష్ట్ర పోటీలలో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

కడప కల్చరల్ : విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించడం అలవాటు చేయాలని సైన్స్ విభాగం శిక్షకులు ఆర్.శ్రీనివాసులురెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా 20వ రోజున సైన్స్ ప్రయోగాలు, విద్యార్థులకు అవగాహన అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రయోగాల ద్వారా విజ్ఞాన శాస్త్రాన్ని శాస్త్రీయ పద్ధతిలో నేర్చుకోవాలని, ఆలోచనతో ప్రకృతి పట్ల ప్రేమను పెంచుకోవాలన్నారు. సైన్స్ క్లబ్ కార్యదర్శి వై.శ్రీధర్‌రావు మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞాన అధ్యయనం నాలుగు గోడలకు పరిమితమైంది కాదని, క్షేత్ర స్థాయిలోనూ, ప్రయోగశాలలతోనూ స్పష్టమైన సంబంధం కలిగి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సులభ స్థాయిలో గణితం నేర్చుకునే పద్ధతులను కూడా వివరించారు. గణిత శిక్షకులు సుబ్రమణ్యం విద్యార్థులకు గణిత చిట్కాలు నేర్పారు.

స్పోకన్ ఇంగ్లీషు, క్రాఫ్ట్ కథా పఠనం, నృత్యం కూడా నేర్పారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ

పులివెందుల టౌన్ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, డ్రాయింగ్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు సిద్ధయ్య సత్య హరిశ్చంద్రుడు గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు ఐస్‌క్రీమ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు అని గ్రంథాలయ అధికారి శేఖర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన సింహాద్రిపురం శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు నీతి కథలు చెప్పడం, వివిధ రకాల పుస్తకాలను చదివించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి శేఖర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదవడం ద్వారా ఎన్నో విషయాలు తెలుస్తాయన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి

వేంపల్లె : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ జిల్లా జాయింట్ సెక్రటరీ గూడూరు రామచంద్ర కోరారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ శివకుమారికి ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ప్రాంతాలలో ఈ చట్టం గురించి పరిజ్ఞానం, దరఖాస్తు చేసే విధానం, దరఖాస్తులను ఎవరికి ఇవ్వాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం కోసం రెవెన్యూ కార్యాలయాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

హైస్కూలు ప్లస్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

వేంపల్లె : స్థానిక హైస్కూలు ప్లస్ ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణయ్య పేర్కొన్నారు. సోమవారం ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్చుకోవడానికి అడ్మిషన్లు మొదలుపెట్టి పిల్లల పేరెంట్స్‌కు తెలియజేస్తూ స్థానిక ఎస్సీ కాలనీ, గాజులపేట, రెడ్డయ్యకాలనీ ప్రాంతాలలో క్యాంపైన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులలో ప్రవేశాలు మొదలయ్యాయని.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూన్ 1వ తేదీ నుండి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

చింతకొమ్మదిన్నె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగర పరిధిలోని 17వ డివిజన్ పరిధిలోని వెంకటగారిపల్లె, పోలుగారిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాస రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, సర్పంచులు సురేంద్రారెడ్డి, మల్లిఖార్జున యాదవ్, సింగిల్ విండో అధ్యక్షులు రాజారెడ్డి, గజ్జల శ్రీరామిరెడ్డి, 17వ డివిజన్ ఇన్‌చార్జ్ గుత్తిరెడ్డి లక్ష్మిరెడ్డి, మట్లి శ్రీనివాసులు రెడ్డి, నాయకులు చిన్న సిద్దయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, శివ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కమలాపురం నియోజకవర్గ పరిధిలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన సికెదిన్నె ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో 45 ఆలయాలకు టీటీడీ శ్రీవాని ట్రస్టు ద్వారా సుమారు రూ.150 కోట్ల నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా రూ. 15 కోట్లతో పొలతల కొండ కింద నుంచి కొండ పైకి డబుల్ రోడ్డు పనులకు, మరింత అభివృద్ధిలో భాగంగా అన్నదాన సత్రం, గెస్ట్ హౌస్, డార్మిటరీ హాల్, టాయిలెట్ బ్లాక్ తదితర నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. వీరపునాయునిపల్లె మండలం సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద కళ్యాణ మండపం మొదలైన కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి, కో -కన్వీనర్ కళా యాదవ్, 16,17వ డివిజన్‌ల కార్పొరేటర్లు నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, గుత్తిరెడ్డి చంద్రహాస్‌రెడ్డి, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గజ్జల శ్రీరామిరెడ్డి, లక్ష్మిరెడ్డి, నీలకంఠారెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

మోసపూరిత హామీలను ప్రజలు నమ్మరు

పులివెందుల టౌన్ : గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి.. ఇప్పుడు మోసపూరిత ఉచిత హామీలు ఇస్తానంటే ప్రజలు ఎలా నమ్ముతారు చంద్రబాబు అని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఎద్దేవా చేశారు. సోమవారం పులివెందులలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల వలన రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడేమో అన్నీ ఉచిత సంక్షేమ పథకాల హామీలు ఎలా ఇస్తున్నారని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వలన రాష్ట్రం అథోగతి పాలవుతుందని విషప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా ఇప్పుడు చంద్రబాబు ఏదో వెలగబెడతారని రాయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు అంటే 420, చంద్రబాబు పాలనలో ఆయన చుట్టూ తిరిగేవాళ్లకు అంటే పెత్తందార్లకు దోచిపెట్టడం మినహాయించి ప్రజలకు వెన్నుపోట్లు, అబద్ధపు హామీలే తప్ప ఇంకేమీ ఉండవని జోస్యం చెప్పారు. చంద్రబాబు ఎన్ని వాగ్దానాలు, హామీలు ఇచ్చినా 2024లో కుప్పంతో సహా అన్ని నియోజకవర్గాలలో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగిస్తుందన్నారు. లోకేష్ బాబు ఎన్ని యాత్రలు చేసినా ప్రజలెవరూ నమ్మరని పేర్కొన్నారు.

పులివెందులలో బైక్ ర్యాలీ



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వరప్రసాద్

పులివెందుల టౌన్ : పులివెందులలో వైఎస్ఆర్ సీపీ శ్రేణులు సోమవారం బైక్ ర్యాలీ చేపట్టారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా, పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా.. అలాగే ఆయన ఇచ్చిన హామీలకు నిరసనగా పులివెందుల పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుల బైకు ర్యాలీని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్పలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో వైఎస్ మనోహర్‌రెడ్డి స్వయంగా బైక్ రైడ్ చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ స్థానిక వైఎస్సార్ సర్కిల్ నుండి మెయిన్ బజార్ మీదుగా పూలంగళ్ల సర్కిల్, కచేరి రోడ్డు, ప్రభుత్వాసుపత్రి మీదుగా ముద్దనూరు రోడ్డు సర్కిల్, పుల్లారెడ్డి ఆసుపత్రి మీదుగా పూలంగళ్ల సర్కిల్ వరకు చేరుకుంది. ఈ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ నాయకులు తమ బైకులకు వైఎస్సార్‌సీపీ జెండాలను కట్టుకుని వైఎస్సార్‌సీపీ నాయకత్వం వర్ధిల్లాలి, జై జగన్, జైజై జగన్, అవినాష్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేసుకుంటూ ముందుకు కదిలారు.